క్లుప్తంగా

ఘనంగా చండీహోమం



నూకాలమ్మ ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

జంగారెడ్డిగూడెం: శ్రీనూకాలమ్మ దేవస్థానంలో 77వ చండీ హోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ శాశ్వత చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ, ఆలయ కమిటీ అధ్యక్షుడు రొంగల నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. చండీహోమంలో పెన్మెత్స సీతారామరాజు, వెంకట వరలక్ష్మి, వంకాలయ సూర్యనారాయణ, విజయేశ్వరి, మోహన్ నారాయణ కుమార్, శారద, వాకదాని శ్రీనివాస్, పుష్పావతి దంపతులు, ఇమ్మడి సురేష్ ఉభయధారులుగా వ్యవహరించారు. బాలా త్రిపుర సుందరి పీఠ ప్రతినిధి ఈమని శశి కుమార్ శర్మ ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. కార్యక్రమంలో పెన్మెత్స సీతారామరాజు, వెంకట వరలక్ష్మి, చిట్లూరి సుబ్బరావు, ముల్లంగి ప్రసాదరెడ్డి, సంధ్య దంపతులు, పోలుపర్తి రాము, గొట్టిముక్కల వంశీ కుమార్ రాజు, గాలి నూకరాజు, మేడపురెడ్డి వెంకట రమణ, చింతకాయల అచ్చిరాజు పాల్గొన్నారు.

జ్ఞాన సరస్వతి అమ్మవారికి పూజలు

జంగారెడ్డిగూడెం: మండలంలోని గురవాయిగూడెం గ్రామంలో వేంచేసియున్న శ్రీహరిహర సుత అయ్యప్పస్వామి దేవస్థానంలో శుక్రవారం సందర్భంగా ఉపాలయమైన శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

డిగ్రీ కాలేజీలో ప్రపంచ జనాభా దినోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ మల్లేశ్వరరావు

కామవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్రం ఎన్ఎస్ఎస్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు మాట్లాడుతూ జనాభా పెరుగుదల వలన కలిగే నష్టాలను గూర్చి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విభాగం కో–ఆర్డినేటర్ డాక్టర్ జి.శ్రీనివాసరావు, కె.ఇందిరాకుమారి, ధారావతు మల్లేష్, పి.ఏడుకొండలు, ఎం.విజయకృష్ణ, సిబ్బంది కుమార్ రాజా పాల్గొన్నారు.

డెంగీ నివారణకు జాగ్రత్తలు తప్పనిసరి



డెంగీ వ్యాధి నివారణపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కామవరపుకోట: డెంగీ వ్యాధి నివారణకు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని తడికలపూడి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ సీహెచ్ సుమ సూచించారు. శుక్రవారం తడికలపూడి గ్రామంలో డెంగీ వ్యాధి రాకుండా నివారణ చర్యలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుమ మాట్లాడుతూ డెంగీ వ్యాధి రాకుండా అందరూ ఇంటి ఆవరణలో చుట్టు పక్కల డ్రెయినేజీల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మురుగు నీటిలో దోమలు ఏర్పడటం వలన అవి నీటిపై గుడ్లను పెట్టి సంతానం ఉత్పత్తి చేసి డెంగీ, మలేరియా వంటి వ్యాధుల వ్యాప్తికి కారణమవుతాయన్నారు. కార్యక్రమంలో చింతలపూడి ఎస్ఈఓ ప్రసాద్ శ్రీనివాస్, పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సత్కారం



సత్కారం అందుకున్న విద్యార్థులు

కొయ్యలగూడెం: పరింపూడి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు స్పందన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బలుసు నాగేశ్వరరావు పాల్గొన్నారు. కొయ్యలగూడేనికి చెందిన అనిపెద్ది శేషయ్య శర్మ చారిటబుల్ ట్రస్ట్ తరపున వారి కుమారులు ప్రసాద్ శర్మ సౌజన్యంతో ఒక్కొక్కరికీ రూ.1000 చొప్పున నగదు పురస్కారం, మెమెంటో అందజేశారు. హెచ్ఎం నిమ్మలూరి ఉమాదేవి, సంస్థ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, కార్యదర్శి జహంగీర్‌బాషా పాల్గొన్నారు.

మన్యంలో బోనాల సందడి

- నైవేద్యాలు సమర్పించిన మహిళలు
- మొక్కులు తీర్చుకున్న భక్తులు
- శాకంబరీదేవి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవార్లు

బుట్టాయగూడెం: మండలంలోని రెడ్డిగణపవరంలో శుక్రవారం బోనాల జాతర పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బండర్లగూడెంలోని తాటి కౌసల్య ఇంటి వద్ద నుంచి బోనాలను భక్తులు అమ్మవారికి ఇష్టమైన నైవేద్యాన్ని తలపై ఎత్తుకొని పోతురాజు విన్యాసాలు, శివ సత్తుల పూనకాలతో గ్రామంలోని అన్ని ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం కనకదుర్గమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా భక్తురాలు కౌసల్య మాట్లాడుతూ గ్రామం సుభిక్షంగా ఉండాలని ఆషాఢ బోనాల జాతర ఊరేగింపు గ్రామంలో నిర్వహించామని చెప్పారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకైన బోనాల జాతరను గత నాలుగు సంవత్సరాల నుంచి రెడ్డిగణపవరంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఆషాఢమాసంలో ఈ బోనాల జాతర ఊరేగింపు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా ఆషాఢమాసం కనకదుర్గమ్మను పలు రకాల కూరగాయలతో అలంకరించారు. అలాగే దేవాలయాన్ని కూడా కూరగాయలతో అలంకరించారు. శుక్రవారం అమ్మవారు శాకాంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చి పూజలందుకున్నారు. దాసరి వేంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొని అమ్మవారికి పూజలు చేసి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

శాకంబరి అలంకరణలో గంగానమ్మ

జంగారెడ్డిగూడెం: ఆషాఢమాసం సందర్భంగా జంగారెడ్డిగూడెం గ్రామ దేవత గంగానమ్మ అమ్మవారిని శాకంబరీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేయగా, అమ్మవారి దర్శనం అనంతరం ప్రసాద వితరణ చేశారు.

గంగానమ్మకు బోనాల సమర్పణ

శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి హై స్కూల్ వద్ద వేంచేసి ఉన్న కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద నుంచి సుమారు 200 మంది మహిళామణులు మేళ తాళాలతో గరగ నృత్యాలతో అంగరంగ వైభవంగా ఆలయానికి వచ్చి గంగానమ్మకు బోనాలు సమర్పించారు. ఆవు పాలతో చేసిన పరమాన్నంతో, వేపాకులు మామిడి తోరణాలతో అలంకరించిన బోనాలతో ఊరేగింపుగా బయలుదేరి గ్రామ దేవత గంగానమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించినట్లు ఆలయ కమిటీ తెలిపింది. అలాగే స్థానిక సుబ్బంపేటలోని లలితాదేవి ఆలయం నుంచి గంగానమ్మకు మహిళలు సారెను తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



బుట్టాయగూడెం: శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ



బుట్టాయగూడెం: రెడ్డిగణపవరంలో ఆషాఢమాసం బోనాలు ఎత్తుకున్న భక్తులు

దుర్గమ్మకు పల్లకీసేవ

పౌర్ణమి తిథిని పురస్కరించుకొని విజయదుర్గమ్మకు పల్లకీ సేవ నిర్వహించినట్లు ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి మాడా రామ్మోహనరావు తెలిపారు. పట్టణ ప్రధాన వీధుల్లో సన్నాయి మేళతాళాలతో వైభవంగా పల్లకీ సేవ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఈమని శశికుమార్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా విజయదుర్గాదేవి

పోలవరం రూరల్: అఖండ గోదావరి నదీ తీరాన వేంచేసియున్న పోలవరం మండలంలోని గూటాల గ్రామంలోని శ్రీవిజయదుర్గాదేవి ఆలయంలో ఆషాఢమాసం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని శాకాంబరీ దేవిగా అలంకరించి ఆషాఢమాస సారె చీర, గాజులు, పసుపు, కుంకుమ, నైవేద్యాలు సమర్పించారు. గ్రామంలోని మహిళలు ప్రాంగణంలో సామూహిక లలితా సహస్ర నామ పారాయణ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించినట్లు ఆలయ అర్చకులు వి.సుబ్రహ్మణ్యం తెలిపారు.

శాకంబరిగా కనకదుర్గమ్మ



శాకంబరి దేవి అలంకరణలో కనకదుర్గమ్మ

కొయ్యలగూడెం: ఆషాఢమాసం మొదటి శుక్రవారం సందర్భంగా గ్రామ దేవతలను, కనకదుర్గమ్మను శాకంబరీదేవిగా అలంకరించారు. గవరవరం గ్రామంలోని శ్రీచక్ర సహిత విజయ దుర్గాదేవి అమ్మవారిని అర్చకులు మామిళ్లపల్లి దేశీతారామ్ శాకంబరీ దేవిగా అలంకరించారు. కన్నాపురం, దిప్పకాయలపాడు, యర్రంపేట, పొంగుటూరు, అంకాలగూడెం, బోడిగూడెం గ్రామాల్లో నిర్వహిస్తున్న శ్రీవిదమ్మ అమ్మవారి ఉత్సవాలు ముగిశాయి.



జంగారెడ్డిగూడెం: గంగానమ్మకు బోనాలు తీసుకొస్తున్న మహిళలు



పోలవరం రూరల్: లలితా సహస్ర నామ పారాయణ చేస్తున్న మహిళలు

ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం



యూనియన్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్న నాయకులు

జంగారెడ్డిగూడెం: ఆర్టీసీ డిపోలో ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భవించి 74 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా డిపోలో జెండా వందన కార్యక్రమం యూనియన్ నాయకులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భవించిన నాటి నుండి నేటి వరకు జరిగిన విజయాలను రీజియన్ సహాయ కార్యదర్శి రంగనాయకులు వివరించారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్ ఏఎస్ఎస్ రావు కేక్ కట్ చేయగా, సీనియర్ ఏడీసీ రాంబాబు జెండా వందన నిర్వహించారు. గ్యారేజీ సెక్రటరీ ప్రవీణ్, రమణ, రిటైర్డ్ ఉద్యోగులు డిపో పబ్లిసిటీ సెక్రెటరీ అచ్యుత్, బాబూరావు, పీఏ స్వామి, రాజారావు, బి.శ్రీను, కేవీ రావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు

చింతలపూడి: కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేసి, ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వినర్ కంభం విజయరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షుడు బొడ్డు వెంకటేశ్వరరావు గృహం వద్ద పట్టణ అధ్యక్షుడు కొప్పుల నాగేశ్వరరావు అధ్యక్షతన పట్టణ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో విజయరాజు మాట్లాడుతూ కూటమి వచ్చి ఏడాది పూర్తయినా ఒక్క హామీని నెరవేర్చలేకపోయిందని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలను ఇంత వరకు ఎందుకు అమలు చేయలేదో సమాధానం చెప్పాలన్నారు. మహిళలకు రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా ఉచిత బస్సు అని చెప్పి ఇప్పుడు కేవలం జిల్లాలకే పరిమితం చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా మున్సిపల్ విభాగం అధక్షుడు బొడ్డు వెంకటేశ్వరరావు, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు సీహెచ్ జ్ఞానారెడ్డి, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు కె.చండీప్రియ, నియోజకవర్గ యూత్‌విభాగం అధక్షుడు ఎం.దిలీప్, శ్రీనివాసరావు, ఎం.ఇమ్మానియేలు, ఎ.సుబ్బారావు, తుమ్మూరి వెంకట్రామిరెడ్డి, గోలి చంద్రశేఖర్‌రెడ్డి, బండారు గోపి, డోకల రాము, ఎండీ రవూఫ్, సొంటి ఖన్నా, ఎస్.దుర్గారావు, మోహన్ రావు, డి.పేద్రాజు, ఎస్‌డీ హాజీ, ఇక్బాల్, పి.మాధవరెడ్డి, సురేంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ వార్డు కమిటీల నియామకం

చింతలపూడి: బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ప్రతి గ్రామ పంచాయతీలోనూ వార్డు కమిటీలను నియమిస్తున్నట్లు చింతలపూడి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కన్వీనర్ కంభం విజయరాజు తెలిపారు. శుక్రవారం చింతలపూడిలో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు స్థానిక నగర పంచాయతీలోని 21 వార్డులకు అబ్జర్వర్లను నియమించినట్లు తెలిపారు. నగర పంచాయతీలోని 1, 2 వారుండలకు పి.మాధవరెడ్డి, 3, 4 వార్డులకు ఆతుకూరి సుబ్బారావు, 5, 6 వార్డులకు కె.ఏలియా, 7, 8 వార్డులకు గడ్డమడుగుల రాజేష్ ఖన్నా, 9, 10 వార్డులకు సీహెచ్ సురేంద్రరాజు, 11, 12 వార్డులకు ఎస్.దుర్గారావు, 13వ వార్డుకు వడిత్య కోట్లు, 14, 15 వార్డులకు మిరియాల దిలీప్, 16,17 వార్డులకు ఎస్కే ఖాజా మొయినుద్దీన్, 18, 19 వార్డులకు బొడ్డు వేంకటేశ్వరరావు, 20వ వార్డుకు గొట్టాపు బాబులను అబ్జర్వర్లుగా నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జంగారెడ్డిగూడెం: మండలంలోని నిమ్మలగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో నిమ్మలగూడెం గ్రామానికి కొత్త లైన్ ఏర్పాటు నిమిత్తం ఈ నెల 12వ తేదీ శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కట్టవపాదలగూడెం గ్రామంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

జంగారెడ్డిగూడెం విద్యుత్ డివిజన్ పరిధిలో భారీ వర్షాలు, గోదావరి వరదల కారణంగా విద్యుత్ అంతరాయాల పునరుద్ధరణకు డివిజన్ ఆఫీస్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు ఈఈ అహ్మద్‌ఖాన్ తెలిపారు. ఏదైనా విద్యుత్ అంతరాయాలు, సహాయం కోసం కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ 9491030712కు ఫోన్ చేయాలని తెలిపారు.

పొల్యూషన్ బోర్డు అధికారుల తనిఖీ



వాటర్ శాంపిల్స్ సేకరిస్తున్న అధికారులు

జంగారెడ్డిగూడెం: నవభారత్ పామాయిల్ ఫ్యాక్టరీని పొల్యూషన్ బోర్డు అధికారులు తనిఖీ చేశారు. ఈ నెల 7న పామాయిల్ ఫ్యాక్టరీ నుంచి వెలువడే పొగ, గాలి, నీరు, బాయిలర్ ద్వారా విడుదలయ్యే బూడితతో కాలుష్యం పెరిగి తాము ఇబ్బందులు పడుతున్నామని మండలంలోని శ్రీనివాసపురం గ్రామస్తులు పొల్యూషన్ బోర్డు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం బోర్డు అధికారి కేవీ రావు పామాయిల్ ఫ్యాక్టరీకి చేరుకొని అనలిస్ట్ తేజస్విని, సిబ్బందితో కలిసి వాటర్ శాంపిల్స్ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీసుకున్న శాంపిల్స్‌ను పరీక్ష చేసి నివేదికను ఉన్నతాధికారులకు అందజేసి చర్యలు తీసుకుంటామన్నారు. కాగా ఏపీ కన్స్యూమర్ రైట్స్ చైర్మన్ ప్రసాద్ మాట్లాడుతూ తాము కూడా వాటర్ శాంపిల్స్‌ను తెలంగాణలో పరీక్ష చేయిస్తామని, రెండు రాష్ట్రాల్లో రిపోర్టులు ఒకేలా రాకపోతే అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఆకాశం.. ఆహ్లాదకరం



రోడ్డును తాకుతున్నట్టు కనిపిస్తున్న మేఘాలు

క్షేత్రంలో శుక్రవారం తెల్లవారు జామున ఆవిష్కృతమైన ప్రకృతి రమణీయ దృశ్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. క్షేత్ర దేవత శ్రీకుంకుళ్లమ్మ ఆలయ సమీపంలో ఆకాశం నీలం, ఎరుపు రంగుల్లో చూడముచ్చటగా కనువిందు చేసింది. అలాగే స్థానిక సబ్‌స్టేషన్ వద్ద మబ్బులు రోడ్డును తాకుతున్నట్టుగా కనిపించాయి. ఇవి చూపరులను ఆకట్టుకున్నాయి.

-ద్వారకాతిరుమల

శ్రమ దోపిడీ కోసమే మనువాద సిద్ధాంతం



కారంచేడు మృతులకు నివాళులర్పిస్తున్న సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు

జంగారెడ్డిగూడెం: పీడిత వర్గాల శ్రమ దోపిడీ చేయడం కోసమే కార్పొరేట్ సంస్థలు మనువాద సిద్ధాంతాన్ని ముందుకు తెస్తున్నాయని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యుడు కేవీ రమణ ఆరోపించారు. జంగారెడ్డిగూడెంలో శుక్రవారం కారంచేడు ఘటనలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేవీ రమణ మాట్లాడుతూ జులై 17కి కారంచేడులో దళితులపై జరిగిన దాడికి 40 సంవత్సరాలు పూర్తయిందన్నారు. ఈ నేపథ్యంలో జులై 11 నుంచి 17 వరకు రాష్ట్ర వ్యాప్తంగా దళిత బహుజనుల్లో స్వీయ గౌరవ ప్రతిఘటనా పోరాట చైతన్యాన్ని పెంపొందించేందుకు సభలు సమావేశాలు నిర్వహించాలని న్యూడెమోక్రసీ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు నిచ్చిందన్నారు. కార్యక్రమంలో ఉప్పాటి దాసు, మద్దిపాటి సత్తయ్య, గంపల వెంకటేష్, కె.రాంబాబు, యడ్లపల్లి మూర్తి, ముప్పిడి నాగేశ్వరరావు, కొత్తూరు చిన్న, గొల్లపల్లి వెంకట్, ముప్పిడి రవి తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ఆత్మ పరిశీలన చేసుకోవాలి

కామవరపుకోట: కూటమి ప్రభుత్వం ఆత్మ పరిశీలన చేసుకోవాలని ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు ములకాల సత్యనారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎస్సీ ఎస్టీ బీసీ సామాజిక వర్గాల కులగణన చేసి ఆయ వర్గాలకు న్యాయం చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ఆత్మ పరిశీలన చేసుకొని అభివృద్ధి కోసం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే చిత్తశుద్ధితో నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలి



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఈఓ శ్రీహరి

కామవరపుకోట: గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిచేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి ఎం.శ్రీహరి తెలిపారు. కామవరపుకోట గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య నిర్వహణ, కొత్తూరులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. తడి, పొడి చెత్తపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామములో ప్రతి ఇంటికీ వెళ్లి చెత్త సేకరణ చేయాలని, అవసరమైన కొత్త రిక్షాలను కొనుగోలు చేయాలని తెలిపారు. చెత్త సేకరణ విషయంలో ఐవీఆర్ఎస్ ఫోన్‌కాల్ సర్వేలో సచివాలయ పరిధిలో సిబ్బంది పనితీరు బాగోలేకపోవడంపై పరిశీలన చేసి, సిబ్బందికి సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.సరళ కుమారి, ఏవో సత్యవేణి, సర్పంచ్ కరిపోతు అనూష, ఉప సర్పంచ్ మేడూరి రంగబాబు, కార్యదర్శి రవి నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు

దెందులూరు: గొర్రెలు, మేకల సంరక్షణకు నట్టల నివారణ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని పశువైద్య శాఖ పోతునూరు జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ సీహెచ్ రాములయ్య దొర అన్నారు. శుక్రవారం పోతునూరులో పశు వైద్య శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు లక్ష్యాలకు అనుగుణంగా ఇంకా చేయించుకోవలసిన కొన్ని మేకలు గొర్రెలకు నట్టల నివారణ మందులు వేశారు. ఈ సందర్భంగా మేకలు, గొర్రెలు, రైతులకు పలు సూచనలు చేశారు.

సర్వసభ్య సమావేశం నిర్వహణ



సమావేశంలో పాల్గొన్న సర్పంచ్, సభ్యులు

కామవరపుకోట: మండల కేంద్రమైన కామవరపుకోట పంచాయతీలో సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. సర్పంచ్ కర్రిపోతు అనూష భాగ్యరాజ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పంచాయతీలో ట్యాంక్ ఆపరేటర్ల జీతాలు పెంచాలని సర్పంచ్, ఉప సర్పంచ్ తీర్మానం ప్రతిపాదించారు. దీనిపై సోమవారం సమావేశంలో తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఇక పలు చెరువుల్లో గుర్రపుడెక్క విపరీతంగా పెరిగిపోయిందని, దీనిని తొలగించాలన్న తీర్మానంపై 6వ వార్డు సభ్యుడు ఘంటా భాస్కరరావు పలు సూచనలు చేశారు. చేపల చెరువుల లీజుదారులు పాడుకున్న పూర్తి మొత్తం వసూళ్లు చేసేలా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో లీజు రద్దు చేసి మళ్లీ పాట నిర్వహించాలని భాస్కరరావు సూచించారు. సమావేశంలో ఉప సర్పంచ్ మేడూరి రంగబాబు, పంచాయతీ కార్యదర్శి వి.రవినాయక్, వార్డు మెంబర్లు, సిబ్బంది పాల్గొన్నారు.